సాక్షి గుంటూరు

సోమవారం । 10 । ఏప్రిల్ । 2023



రూ. లక్ష విరాళం అందజేత

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో నిర్వహించే నిత్యాన్నదానానికి ఎన్టీఆర్ జిల్లాకు చెందిన భక్తులు ఆదివారం రూ. లక్ష విరాళాన్ని అందజేశారు.



సూర్యోపాసన సేవ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన సేవ ఆదివారం నిర్వహించారు.

కరోనా @ జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా ఆదివారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (సోమ)	సహర్ (మంగళ)
గుంటూరు	6:27	4:38
నరసరావుపేట	6:29	4:37
బాపట్ల	6:27	4:38

ఘనంగా ఈస్టర్ పండుగ



గుంటూరు నార్త్ ప్యారిస్ చర్చిలో ప్రార్థనలకు హాజరైన విశ్వాసులు

ఏసు క్రీస్తు పునరుత్థాన దినాన్ని క్రైస్తవులు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. క్రీస్తు మరణాన్ని జయించి పునరుత్థానం పొందడానికి సూచికగా జరుపుకుంటారు. తెల్లవారుజామునే పెద్దల సమాధుల వద్ద కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేశారు. గుంటూరు నగరంలోని చర్చిల్లో జరిపిన ప్రత్యేక ప్రార్థనల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

- సాక్షి నెట్‌వర్క్



చర్చిలో ప్రార్థన చేస్తున్న రెవ. సతీష్‌బాబు

న్యూస్‌రీల్

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 528.10 అడుగుల వద్ద ఉంది. ఇది 164.4612 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎడమ కాలువకు 4,097, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 27,587, ఎస్‌ఎల్‌బీసీకి 1,350, వరదకాలువకి 320 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 33,354 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 24,410 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటి మట్టం 805.00 అడుగుల వద్ద ఉంది. ఇది 31.5690 టీఎంసీలకు సమానం.

16న జాతీయ సాహితీ పురస్కార సభ

విజయవాడ కల్చరల్: కృష్ణా జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో 16వ తేదీన హోటల్ ఐలాపురంలో జాతీయ సాహితీ పురస్కార సభ నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు గుత్తికొండ సుబ్బారావు, డాక్టర్ జీవీ పూర్ణచందు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022 సంవత్సరానికి గానూ మండలి వెంకట కృష్ణారావు సాహితీ పురస్కారాన్ని మనసు ఫౌండేషన్ నిర్వాహకులు మన్నం రాయుడుకి, ఆలూరి బైరాగి సాహితీ పురస్కారం డాక్టర్ వెన్నా వల్లభరావుకు, గుత్తికొండ సుబ్బారావు పురస్కారాన్ని రాష్ట్రేతర తెలుగు సమాఖ్యకు, ముక్కామల నాగభూషణం పాత్రికేయ పురస్కారం పి.రాజసుకకు, పోలవరపు కోటేశ్వరరావు కథా పురస్కారం డాక్టర్ కొచ్చర్లకోట వెంకట సుబ్బారావుకు, పోలవరపు కోటేశ్వరరావు బాల సాహిత్య పురస్కారం మంజులూరి కృష్ణకుమారికి, వేములపల్లి కేశవరావు విశాలాక్షి అనువాద ప్రతిభా పురస్కారాన్ని ముకుంద రామారావును ఎంపిక చేశామని చెప్పారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం



విజయవాడ స్పోర్ట్స్: కరాటే సాధన చిన్నారుల్లో మానసిక వికాసాన్ని పెంచుతుందని భవానీపురం పోలీస్‌స్టేషన్ ఇన్‌చార్జ్ సీఐ సురేష్‌రెడ్డి తెలిపారు. విద్యాధరపురం అగర్వాల్ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి కరాటే క్రీడాకారుల ఎంపిక పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ కరాటే సాధన ఆత్మరక్షణకు దోహదపడటంతో పాటు చిన్నారుల్లో సృజనాత్మకతను పెంచుతుందని చెప్పారు. మన దేశంలో కరాటే కొన్ని వందల ఏళ్లుగా ఉందని పేర్కొన్నారు. తల్లిదండ్రులు వారి చిన్నారులకు కరాటే శిక్షణ ఇప్పించాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ స్టేర్స్ ఎంపవరింగ్ యూత్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలను అసోసియేషన్ రాష్ట్ర ప్రతినిధులు జక్కుల శ్రీనివాసులు, ఎన్టీఆర్ జిల్లా ప్రతినిధి జక్కుల హరినాథ్, ఏలూరు జిల్లా ప్రతినిధి ఎండీ షకీల్ పోటీలను పర్యవేక్షించారు. అనంతరం ఈ నెల 15,16 తేదీల్లో న్యూ ఢిల్లీలో జరిగే జాతీయ పోటీలకు ప్రాతినిధ్యం వహించే రాష్ట్ర జట్టును ఎంపిక చేశారు.

డెల్టాకు 1016 క్యూసెక్కులు విడుదల

దుగ్గిరాల(తాడేపల్లి రూరల్): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద ఆదివారం 1016 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యాంక్ కెనాల్‌కు 82 క్యూసెక్కులు, తూర్పు కెనాల్‌కు 91 క్యూసెక్కులు, పశ్చిమ కెనాల్‌కు 41 క్యూసెక్కులు, కొమ్మమూరు కాల్వకు 640 క్యూసెక్కులు విడుదల చేశారు.

పులిచింతల ప్రాజెక్టు నీటి నిల్వ



అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 40.2577 టీఎంసీలు. ప్రాజెక్టు ఎగువ నుంచి 200 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 4200 క్యూసెక్కుల వదులుతున్నారు.

వాహనం తీసేసినా.. పన్ను పడుద్ది!

- స్క్రాప్‌కు వేసినా.. వాహనం వద్దనుకున్నా.. దరఖాస్తు తప్పనిసరి
- లేకుంటే ఏదైనా ఘటన జరిగితే యజమానులదే బాధ్యత

'గుంటూరు జిల్లా పొన్నూరుకు చెందిన ఒక డ్రైవర్ కారు కొనుగోలు చేశాడు. కొంత కాలం తరువాత స్క్రాప్ కింద విక్రయించేశాడు. కానీ ఆర్టీఓ అధికారులు పన్ను చెల్లించాలని నోటీసు ఇచ్చారు. హడావిడిగా ఆర్టీఓ అధికారులను కలసి కారును స్క్రాప్ కింద విక్రయించేశానని.. అధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. ఆ విషయాన్ని ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా తెలియజేయాల్సిన అవసరం ఉందని బదులిచ్చారు. ఆఖరికి నాలుగు త్రైమాసికాల పన్నులు చెల్లించాడు. ఇలా చాలా మంది ఇబ్బంది పడుతుంటారు..' దీనిపై అవగాహన అవసరం.

పట్నంబజారు: నూతన వాహనం కొనుగోలు చేసే సమయంలో ధ్రువీకరణ పత్రాలు సరి చూసుకోవటమే కాదు.. వాహనాన్ని తీసి వేసినా.. స్క్రాప్ కింద వేసినా.. ఇతరులకు విక్రయించినా.. ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు వాహనాన్ని తీసుకెళ్లినా.. అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లాల్సిందే. జిల్లాలో మొత్తం లక్ష 1,980 వాహనాలు ఉన్నాయి. వాటిలో 24,936 లారీలు, 1389 మ్యాక్సీ క్యాబ్‌లు, 6121 మోటార్ క్యాబ్‌లు, 16,179 కమర్షియల్ ట్రాక్టర్లు, 28,390 ఆటోలు, 839 ఆటోలు, 2897 స్కూల్ బస్సులతో పాటు ఇతరత్రా ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు ఉన్నాయి. అయితే వాటిలో అనేక సంవత్సరాలుగా త్రైమాసిక పన్ను బకాయిలు పడ్డారు. అధికారుల గణంకాల ప్రకారం ఇప్పటి వరకు 7,760 వాహనాలు పన్నులు చెల్లించనవిగా గుర్తించారు. వాటిలో ఒక త్రైమాసికం చెల్లించనవి 559, రెండుకుపైగా చెల్లించనవి 333, మూడు త్రైమాసికాలు 271, నాలుగు చెల్లించనవి 393, ఐదు త్రైమాసికాలవి 246, ఐదుకు పైగా ఉన్నవి 5,978 వాహనాలను గుర్తించారు. అయితే ఇప్పటికే సదరు వాహన యజమానులకు నోటీసులు జారీ చేయటంతో పాటు, నిత్యం పన్నులు చెల్లించాలని సమాచారం అందజేస్తున్నారు.

లేని వాహనాలో ఎన్నో....

జిల్లాలో త్రైమాసిక పన్నులు చెల్లించాల్సిన వాహనాలు 7,760 ఉండగా వాటిలో అనేక వాహనాలు



ఆర్టీఓ కార్యాలయం(ఫైల్)

అసలు లేనే లేవని అధికారులు గుర్తించారు. వేలాది వాహనాలు ప్రమాదాలకు గురైనవి వదిలివేయటం, కాలం చెల్లిన వాహనాలను స్క్రాప్‌కు వేయటం, ఫైనాన్స్ కంపెనీల ప్రతినిధులు తీసుకెళ్లిన వాహనాల గురించి పట్టించుకోకపోవటం, విక్రయించిన వాహనాల గురించి సమాచారం ఇవ్వకపోవటం వంటివి ప్రధాన గుర్తించారు. 7,760 వాహనాల్లో సుమారుగా రెండు వేల నుంచి మూడు వేల వాహనాలు స్క్రాప్‌తో పాటు ఇతర అంశాల్లో సంబంధిత యజమానుల వద్ద లేనట్లు గుర్తించినట్లు సమాచారం.

పన్ను పడుతూనే ఉంది...

వాహనాలకు సంబంధించి యజమానుల దగ్గర వాహనం లేనప్పటికీ త్రైమాసిక పన్నులు మాత్రం పడుతూనే ఉంటాయని అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో వాహనదారులు వాహనాలు స్క్రాప్‌కు వేసినా, ఇతరత్రా అంశాల్లో కోల్పోయినా.. కనీసం అధికారులకు సమాచారం ఇవ్వకపోవటంతో వాటికి పన్నులు పడుతూనే ఉన్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో అధికారులు వాహనాలకు సంబంధించి దరఖాస్తులు చేసుకోవాలని సూచిస్తున్నారు. వాహనాన్ని స్క్రాప్ కింద తీసివేసినా, ఫైనాన్స్ వారు తీసుకుపోయినా, ప్రమాదం జరిగి ఎక్కడైనా వాహనం నిలిచిపోయినా.. తప్పని సరిగా తెలియజేయాల్సి ఉందని నిబంధనలు చెబుతున్నాయి. 2022-23 సంవత్సరానికి సంబంధించి తీసివేసిన, స్క్రాప్‌కు పంపిన వాహనాల గురించి దరఖాస్తు చేసుకున్న వారు కేవలం 45 మంది మాత్రమే.

గ్రామీణ ప్రాంతాల్లోనే అధికం..

వాహనాలను తీసివేయటం, ఫైనాన్సర్ తీసుకెళ్లటం వంటివి గ్రామీణ ప్రాంతాల్లో అధికంగా ఉన్నాయి. వాటికి సంబంధించి యజమానులు దరఖాస్తు చేసుకోకపోవటం వలన పన్నులు పెరిగిపోతున్నాయని అధికారులు గుర్తించారు. స్క్రాప్‌కు వేసిన వాహనానికి సంబంధించి ఛాయిస్ నంబర్లు దుర్వినియోగానికి పాల్పడితే.. దానికి సంబంధించి వాహన యజమానే బాధ్యత వహించాల్సి ఉంటుందని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇదే క్రమంలో వాహనం స్క్రాప్‌కు వేసినట్లు దరఖాస్తు చేసుకుని రోడ్డుపై తిరిగినా తీవ్ర పరిణామాలు ఉంటాయని, వాహనాన్ని సీజ్ చేయటంతో పాటు కేసులు నమోదుకు అవకాశం ఉందని చెబుతున్నారు. వాహన యజమానులు ఈ విషయాన్ని గుర్తించి వాహనాన్ని తీసివేసినా.. ఫైనాన్సర్ తీసుకుని వెళ్ళినా.. ఇతరత్రా అంశాలు జరిగితే దరఖాస్తు చేసుకోవటంతో పాటు అధికారుల దృష్టికి తీసుకుని రావాలని సూచిస్తున్నారు.

కచ్చితంగా దరఖాస్తు చేసుకోవాలి



వాహనాన్ని తీసిసేనా, విక్రయించినా, స్క్రాప్‌కు వేసినా, ఫైనాన్స్ యజమానులు తీసుకుని వెళ్లినా కచ్చితంగా దరఖాస్తు చేసుకోవటంతో పాటు అధికారుల దృష్టికి తీసుకురావాలి. ట్రాన్స్‌పోర్టు వాహనాలు అయితే.. వాహనాలు మన దగ్గర లేకపోయినప్పటికీ త్రైమాసిక పన్నులు, పైన జరిమానాలు పడుతూనే ఉంటాయని యజమానులు గమనించాలి. స్క్రాప్‌కు వేసినప్పటికీ ఛాయిస్ నంబర్లు దుర్వినియోగం పాలయ్యే అవకాశాలు ఉన్నాయి. యజమానులు గమనించి వాహనాల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకుని నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకోవాలి.

–షేక్ కరీం, డీటీసీ, గుంటూరు జిల్లా

వైద్యులు రాజకీయాల్లోకి రావాలి

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్

పట్నంబజారు: సమాజ శ్రేయస్సు కోసం వైద్యులు రాజకీయాల్లోకి రావాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ చెప్పారు. జగనన్న నవోత్సవాల్లో భాగంగా బృందావన్ గార్డెన్స్‌లోని వైఎస్సార్ సీపీ ప్రాంతీయ కార్యాలయంలో 'జగనన్న పాలనలో వైద్య విధానాలు- సంస్కరణలు' అనే అంశంపై సదస్సు ఆదివారం నిర్వహించారు. సమావేశానికి వైఎస్సార్ సీపీ డాక్టర్స్ విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వై.షేక్ అధ్యక్షత వహించారు. తొలుత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ వైద్యుడు ఏ మాట చెప్పినా.. ప్రజలు కచ్చితంగా వింటారని, అటువంటి పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రతి ఒక్కరికి చేరేలా వైద్యులు కృషి చేయాలని సూచించారు. గత ప్రభుత్వంలో ప్రభుత్వాసుపత్రికి వెళ్ళాలంటేనే భయపడే పరిస్థితులు ఉండేవని, అందుకు భిన్నంగా ప్రస్తుతం ప్రైవేట్ ఆస్పత్రి కంటే ప్రభుత్వాస్పత్రుల్లో అన్ని వసతులు కల్పించిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందని చెప్పారు. మహానేత వైఎస్సార్ వైద్య విద్యను అభ్యసించటంతో పాటు, వైద్యుడిగా పని చేస్తూనే రాజకీయాల్లో వచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. తూర్పు ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా మాట్లాడుతూ దివంగత మహానేత వైఎస్సార్ అంటేనే గుర్తుకు వచ్చేది ఆరోగ్యశ్రీ వంటి గొప్ప పథకమని, ఆయన తనయుడిగా సీఎం జగన్



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్

వైద్య రంగంలో అనేక విప్లవాత్మక మార్పులు తీసుకుని వచ్చారని కొనియాడారు. ఫ్యామిలీ డాక్టర్ ద్వారా నేరుగా వైద్యాన్నే గడప ముంగిటకే పంపే గొప్ప నిర్ణయం తీసుకోవటంతో పాటు, అందుకు తగ్గట్లు వైద్యులను కూడా అందుబాటులోకి తీసుకునివచ్చారన్నారు. డాక్టర్ వైఎస్సార్ హెల్త్‌కేర్ ట్రస్ట్ ప్రత్యేక అధికారి డాక్టర్ యడ్ల అశోక్‌బాబు మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ ద్వారా గతంలో 1059 సేవలు అందుబాటులో ఉంటే, సీఎం జగన్ వాటిని 3,255 పెంచినట్లు వివరించారు. పార్టీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల అశోక్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 16 మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. సభాధ్యక్షత వహించిన డాక్టర్ షేక్ మాట్లాడుతూ ప్రతి మండలంలో రెండు పీహెచ్‌సీ సెంటర్లు ఏర్పాటు చేసి, ఇద్దరు డాక్టర్, సిబ్బంది ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో పలు కార్పొరేషన్‌ల చైర్మన్‌లు మెహబుబ్, ఆర్.జాన్‌బాబు, కె.శివరామిరెడ్డి, చదలవాడ రవీంద్ర, ముంతాజ్, మండేపూడి పురుషోత్తం, మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

పార్టీలో చేరిక...

జగనన్న పాలనలో వైద్య సంస్కరణలు సమావేశంలో భాగంగా డాక్టర్ వై.షేక్ ఆధ్వర్యంలో సుమారు 70 మంది వైద్యులు, వైద్య విభాగానికి చెందిన వ్యక్తులు వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి డొక్కా మాణిక్యవరప్రసాద్, ఎమ్మెల్యే ముస్తఫా, అశోక్‌రెడ్డి కండువాలు కప్పి స్వాగతం పలికారు. రానున్న ఎన్నికల్లో తిరిగి సీఎం జగన్‌ను ముఖ్యమంత్రిని చేసేందుకు పాటుపడాలని సూచించారు. పార్టీలో చేరిన వారిలో వైద్యులు బాలకృష్ణ, సురేంద్రరెడ్డి, రాజా, డి.విక్రమ్, రాజశేఖర్, ఆయేషా, సాహితి, అల్లాడి ఆదిత్యమణి, సోమరౌతు సీతారామరాజు, షేక్ సుభాని, బి.పరమేశ్వర్, షేక్ సైదాబి పాల్గొన్నారు.

డీఎస్సీఅభ్యర్థుల కల నెరవేరిన వేళ..

- ఉమ్మడి గుంటూరు జిల్లాలో 229 మందికి పోస్టింగ్స్
- ఈనెల 12వ తేదీలోగా ప్రక్రియ పూర్తి చేయాలని విద్యాశాఖ ఉత్తర్వులు

గుంటూరు ఎడ్యుకేషన్: డీఎస్సీ- 1998 అభ్యర్థుల కల ఫలించింది. పాదయాత్ర సమయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. అధికారం వచ్చిన వెంటనే క్వాలిఫైడ్ అభ్యర్థుల జీవితాల్లో వెలుగు నింపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ కొలువుల కోసం ఎప్పుడో 25 ఏళ్ల క్రితం ఇచ్చిన నోటిఫికేషన్ ఆధారంగా పరీక్షలు రాసి, అర్హత సాధించినప్పటికీ ఉద్యోగాలు రాకపోవడంతో, మంచి మనసున్న ఏ ముఖ్యమంత్రి తమ గోడు ఆలకించకపోతారా అని కళ్లు కాయలు కాసేలా ఎదురు చూసిన అభ్యర్థులకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. 1998 క్వాలిఫైడ్ అభ్యర్థులకు పోస్టింగ్స్ కల్పిస్తున్నట్లు గతంలో ప్రకటించిన ప్రభుత్వం విద్యాశాఖ ద్వారా జిల్లాల వారీగా క్వాలిఫైడ్ అభ్యర్థుల వివరాలు సేకరించింది. తాజాగా రాష్ట్ర వ్యాప్తంగా వందలాది మంది అభ్యర్థులకు పోస్టింగ్స్ ఇచ్చేందుకు నిర్ణయించిన ప్రభుత్వం ఈనెలలోనే దానిని పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులకు ఈనెల 13లోపు పోస్టింగ్స్ కల్పించాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్. సురేష్‌కుమార్ విడుదల చేసిన ఉత్తర్వులకు అనుగుణంగా విద్యాశాఖాధికారులు చర్యలు ప్రారంభించారు. కాగా ఉద్యోగ నియామక పరీక్షలు రాసిన 25 ఏళ్ల తరువాత ఉద్యోగ నియామకాలకు ప్రభుత్వం ఏర్పాట్లు చేయడంపై అభ్యర్థులు ఆనందోత్సాలు వ్యక్తం చేస్తున్నారు. కాగా విద్యాశాఖాధికారులు గతేడాది అక్టోబర్‌లో గుంటూరు నగరంలో క్వాలిఫైడ్ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేశారు.

డీఈఓ కార్యాలయంలో కౌన్సెలింగ్..

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 229 మంది అభ్యర్థులకు పోస్టింగ్స్ కల్పించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ తెలిపారు. ఈనెల 12వ తేదీలోగా నియామక ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించిన దృష్ట్యా, అందుకు అనుగుణంగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. మినిమం టైం స్కేల్‌పై ఉపాధ్యాయులుగా నియమితులైన అభ్యర్థులను అవసరమైన పాఠశాలల్లో నియమిస్తామని చెప్పారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల నుంచి ఎంపికైన అభ్యర్థుల జాబితాను https://doefnt.bofrpot.com సైట్‌లో ఉంచినట్లు చెప్పారు. అభ్యర్థులు ఈనెల 12న ఉదయం 10 గంటలకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, ఐదు పాస్‌పోర్ట్ ఫోటోలు, డీఎస్సీ-1998 హాల్ టిక్కెట్‌ను తీసుకుని గుంటూరు జిల్లా కలెక్టరేట్ వద్ద ఉన్న డీఈవో కార్యాలయంలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు.

మొక్కజొన్న కోతలు ఆరంభం

- ఎకరాకు 35-40 క్వింటాళ్ల దిగుబడులు
- ఉమ్మడి జిల్లాలో రూ.1.60 లక్షల ఎకరాల్లో సాగు
- 'మద్దతు'గా మార్కెట్ ధర

తెనాలి: జిల్లాలోని మాగాణి పొలాల్లో ప్రధానమైన వరి పైరు తర్వాత రబీలో సాగుచేసిన మొక్కజొన్న చేతికొస్తోంది. ముదురు చేలల్లో కండె విరవటం ఆరంభించారు. మరో వారం, పదిరోజుల్లో ముమ్మరం కానుంది. ఎకరాకు 35-40 క్వింటాళ్ల దిగుబడులు రావటం, మార్కెట్ ధర 'మద్దతు'గా ఉండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

జీరో టిల్లేజ్ విధానంలో డెల్టాలో ఆరంభించిన నాటి నుంచి జిల్లాలో రబీలో మొక్కజొన్న తప్పనిసరి సాగు అవుతోంది. ఖర్చులు భరించలేని రైతులు జొన్న వైపు మొగ్గు చూపుతున్నారు. ఖరీఫ్ సీజనులో సాగుచేసే వరి పంట ఆదాయానికి, ఖర్చులకు సరిపోతుండటంతో రైతులకు, కౌలు రైతులు రబీలో సాగు చేస్తున్న మొక్కజొన్న, జొన్న పంటలే ఎంతోకొంత ఆదాయాన్ని ఇస్తున్నాయి. దిగుబడులు బాగుండటంతో పాటు మార్కెట్ ధరలు కూడా సంతృప్తిగా ఉండటంతో రబీలో ఈ పంటలకే రైతులు మొగ్గుచూపుతూ వస్తున్నారు. ఈ ఏడాది మొక్కజొన్న విస్తీర్ణం బాగా పెరిగింది.



కొల్లిపర ప్రాంతంలో మొక్కజొన్న కండె విరుస్తున్న మహిళా కార్మికులు

2023-24 రబీ సీజనులో జిల్లాలోని మాగాణి భూముల్లో జొన్న, మొక్కజొన్న సాగు విస్తారమైంది. గుంటూరు జిల్లాలో రబీలో మొక్కజొన్న సాధారణ విస్తీర్ణం 53 వేల ఎకరాలు కాగా, ప్రస్తుత రబీ సీజనులో 63,386 ఎకరాల్లో సాగు చేశారు. ఇందులో అత్యధిక విస్తీర్ణం తెనాలి డివిజనులోనే ఉంటుందని తెలిసిందే. ఉమ్మడి గుంటూరు జిల్లా మొత్తం 1.60 లక్షల ఎకరాల విస్తీర్ణంలో మొక్కజొన్న పైరు సాగుచేశారు రైతులు. అదేవిధంగా జిల్లాలో జొన్న 29,405, పెసర 24,463 ఎకరాలు, మినుము 9,452 ఎకరాలు, శనగ 16,175 ఎకరాల్లో పండించారు.

గత నెల రెండోవారంలో కోస్తాంధ్రలో అసాధారణ వర్షాలపై వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులు ఆందోళన పడాల్సివచ్చింది. చెదురు మదురు వర్షాలు మినహా భారీస్థాయిలో లేకపోవటంతో రైతులు ఊరట చెందారు. అనుకున్నట్టుగానే మొక్కజొన్న సగటున 35 క్వింటాళ్ల దిగుబడి వస్తోందని చెబుతున్నారు. కేంద్ర ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలుకు రూ.1962 కాగా ప్రస్తుతం మార్కెట్‌లో రూ.1950 నుంచి రూ.2020 వరకు పలుకుతోంది. మొక్కజొన్న విరవటం ఇప్పుడే ఆరంభమైందని, ఇంకా అమ్మకాలు జరగలేదని రైతులు చెబుతున్నారు. మరో వారం గడిస్తేనే మార్కెట్‌వర్గాలు కొనుగోళ్లకు సమాయత్తం కాలేదనీ, అప్పుడు ధరలో కొంత పెరుగుదల వస్తుందన్న ఆశాభావాన్ని రైతులు వ్యక్తంచేస్తున్నారు.



వేమూరులో జగనన్నే మా భవిష్యత్- మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో భాగంగా ఆదివారం మహిళలకు పథకాలపై అవగాహన కల్పిస్తున్న మంత్రి మేరుగ నాగార్జున -వేమూరు



మాచర్ల పట్టణంలో నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్- మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో స్టిక్కర్లు అందజేస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి తదితరులు -మాచర్ల

సంజీవదేవ్ రచనలు ఆణిముత్యాలు

- సానుకూలతకు, విశాల భావనల ప్రేరేపితాలు
- 'రసధ్వని' పుస్తకావిష్కరణ సభలో మండలి బుద్ధప్రసాద్


'రసధ్వని' పుస్తకాన్ని ఆవిష్కరించిన బుద్ధప్రసాద్ చిత్రంలో వైవీ రావు, రవిబాబు, డాక్టర్ దక్షిణామూర్తి, రవీంద్రనాథ్

తెనాలి: కళాతపస్వి సంజీవదేవ్ రచనలు సమాజంలో సానుకూల దృక్పథం, విశాలమైన భావనల పెంపునకు దోహదపడతాయని రాష్ట్ర శాసన సభ మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ అభిప్రాయపడ్డారు. సానుకూలత అలవరచుకుని, రసానుభూతితో జీవితం గడపాలన్నా, కళల పట్ల అభిరుచి కలగాలన్నా నేటితరం సంజీవదేవ్ రచనలను చదవాలన్నారు. తెనాలిలోని డాక్టర్ సంజీవదేవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్లో ఏర్పాటైన సభకు ప్రజాసాహితి మాసపత్రిక సంపాదకుడు కొత్తపల్లి రవిబాబు అధ్యక్షత వహించారు. ప్రముఖ రచయితలు శ్రీరమణ, వెనిగళ్ల వెంకటరత్నం, ఎస్ఆర్ తపస్వి తాజాగా సంజీవదేవ్ సాహిత్యం-జీవితంపై ఏర్చికూర్చి తీసుకొచ్చిన 'రసధ్వని' పుస్తకాన్ని మండలి బుద్ధప్రసాద్ ఆవిష్కరించారు. సభలో తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ సంజీవదేవ్ జీవితంలో, రచనల్లో ఎక్కడా ప్రతికూలత లేదన్నారు. ఆయన రచనలన్నీ ఆణిముత్యాలుగా చెప్పారు. సానుకూల దృక్పథం తగ్గిపోతున్న నేటిరోజుల్లో మనిషి మనిషిలాగా నడుచుకోవటం లేదన్నారు. విశాల భావనలు మచ్చుకైనా కనిపించటం లేదన్నారు. ఈ నేపథ్యంలో సంజీవదేవ్ వ్యక్తిత్వం, రచనలు నేటి తరానికి ఉపకరించాలన్న భావనతో సంకలనకర్తలు చేసిన ప్రయత్నం నెరవేరాలన్న ఆకాంక్షను వ్యక్తంచేశారు. సంజీవదేవ్‌తో తన అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ, ఆయన తనకు రాసిన లేఖలను పుస్తకరూపంలో తీసుకురావాలన్న అభిలాషను వ్యక్తంచేశారు. ప్రముఖ రచయిత ముత్తేవి రవీంద్రనాథ్ తన ప్రసంగంలో, సంజీవదేవ్‌ను మార్మికదృష్టి కలిగిన కళా విమర్శకుడిగా అభివర్ణించారు. రచనలు, చిత్రకళ, లేఖాసాహిత్యంలో ఆయన ప్రతిభను, శైలిని వివరిస్తూ, సంజీవదేవ్ భాషకు చేసిన సేవను ప్రత్యేకంగా చెప్పారు. ప్రపంచ సంధాన భాష రూపొందించుకోవాలనేది ఆయన అభిమతమని పేర్కొన్నారు. చైతన్య వేదిక వ్యవస్థాపకుడు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి మాట్లాడుతూ, బహుముఖ ప్రజ్ఞావంతుడైన సంజీవదేవ్ మానవత్వమే గొప్పదని ప్రతిపాదించారన్నారు. కొత్తపల్లి రవిబాబు మాట్లాడుతూ సంజీవదేవ్ ప్రకృతిని ఎంతగా ఆరాధించాడని చెప్పేందుకు ఆయన చిత్రాలే నిదర్శనాలని పేర్కొన్నారు. తొలుత సంజీవదేవ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. మండవ కృష్ణప్రసాద్, మొవ్వా సత్యనారాయణ, వేమూరి విజయభాస్కర్, బొమ్మదేవర వెంకటేశ్వరరావు, ఆచంటి శ్రీనివాసరావు, చందు నాగేశ్వరరావు పాలడుగు ఆనందయ్య పాల్గొన్నారు. ఫౌండేషన్ కార్యదర్శి వైవీ రావు పర్యవేక్షించారు.

హత్య కేసులో ఐదుగురు అరెస్టు


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీకాంత్

చీరాల రూరల్: చీరాలలో సంచలనం సృష్టించిన హత్య కేసులో ఐదుగురు నిందితుల్నిపోలీసులు అరెస్టు చేశారు. ఈపురుపాలెం పోలీసు స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎస్పీ పి. శ్రీకాంత్ నిందితుల వివరాలు వెల్లడించారు. హతుడు తోటవారిపాలెంలోని వీరయ్య నగర్‌కు చెందిన దోనెపూడి సన్నీ, ఈపురుపాలేనికి చెందిన దేవరకొండ విజయ్, దేవరకొండ శ్రీకాంత్, దేవరకొండ శశాంక్, బొమ్మిడి శివనాగ కృష్ణ, ఇట్టా వెంకటేష్ సన్నిహితంగా ఉండేవారు. అయితే, సన్నీ వీరందరిని అడపాదడపా బెదిరించి డబ్బులు వసూలు చేస్తుండేవాడు. ఈ క్రమంలో ఏడాది కిందట ఓ విషయంలో దేవరకొండ శశాంక్‌ను బంధించి ఇష్టం వచ్చినట్లు కొట్టాడు. అదీకాక ఈ మధ్య సన్నీ వారందరిని బెదిరించి డబ్బులు తీసుకోడం ఎక్కువైంది. ఈ క్రమంలో గత నెల 29వ తేదీ సాయంత్రం 6:30 గంటలకు రాజస్థాన్‌కు చెందిన ఓ కుర్రాడి విషయంలో శశాంక్‌కు మృతుడు సన్నీ అన్నయ్య దోనెపూడి విజయ్‌కుమార్ అలియాస్ టింకుకు గొడవ జరిగింది. ఈ క్రమంలో టింకు ఇంటిలో ఉన్న కత్తి తీసుకొచ్చి శశాంక్‌పై దాడికి ప్రయత్నించాడు. విషయం తెలుసుకున్న దేవరకొండ విజయ్, దేవరకొండ శ్రీకాంత్, శివనాగకృష్ణ కలసి బోయినవారి పాలెం రోడ్డులో ఉన్న రైస్ మిల్లు వద్దకు రెండు బైకులపై వచ్చి శశాంక్‌పై ఎందుకు దాడి చేస్తున్నావని ప్రశ్నించారు. మరింత ఆగ్రహం చెందిన టింకు వారిపై కూడా దాడికి యత్నించాడు.

అదును చూసి పక్కా ప్లాన్

సన్నీ కూడా అప్పుడప్పుడు వారందరిని బెదిరించి డబ్బులు వసూలు చేయడం, అన్నయ్య కత్తులతో దాడిచేయడం వంటి విషయాన్ని మనసులో పెట్టుకుని విసుగు చెందిన వారందరూ ఎలాగైనా హతమార్చాలని నిశ్చయించుకున్నారు. అప్పటి నుంచి సన్నీని హతం చేయాలని రైల్వే ట్రాక్ పక్కన మద్యం తాగుతూ ప్రణాళికలు రచించారు. అదే రాత్రి 7:30 గంటల సమయంలో విజయ్, శ్రీకాంత్, శశాంక్‌లు ఇంటివద్ద ఉన్న కొడవలిని తీసుకుని రెండు ద్విచక్ర వాహనాలతో వెతకడం ప్రారంభించారు. సన్నీ స్నేహితుడు అమీన్ వీరికి తారసపడడంతో, అతడి ద్వారా ఫోన్ చేయించి విజయ్, శశాంక్ మాట్లాడారు. పార్టీ చేసుకుందాం.. పాత గొడవలను రాజీ చేసుకునే విషయం మాట్లాడుకుందామని కుందేరు వద్ద గల డయ్యింగ్ యూనిట్ వద్దకు రావాలని చెప్పారు. వెంటనే ఏ మాత్రం ఆలస్యం చేయకుండా అతడు అక్కడకు వచ్చాడు. అక్కడే కాపుకాసి ఉన్న విజయ్, శ్రీకాంత్, శశాంక్‌లు కలసి సన్నీని కుందేరు వద్దనున్న చెత్త వేసే షెడ్ వెనక్కు తీసుకెళ్లారు. అందరూ కలసి మద్యం తాగారు. అంతకు ముందే అక్కడ ఇమ్మి, కిరణ్, రోహిత్, రవీంద్ర, రామకృష్ణ ఉన్నారు. వీరందరూ వెళ్లిన తరువాత విజయ్, శ్రీకాంత్, శశాంక్, శివనాగ కృష్ణ కలసి సన్నీపై విచక్షణ రహితంగా దాడి చేశారు. కొడవలి, నాపరాయి బండ ముక్కతో తలపై, ఒంటిమీద, కాళ్లమీద ఇష్టం వచ్చినట్లు దాడి చేశారు. సన్నీ తల పగిలి తీవ్ర రక్తస్రావమైంది. నోట్లో నుంచి రక్తం కారడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అక్కడకు ఇట్టా వెంకటేష్ తాడు తీసుకుని ఘటనా స్థలానికి చేరుకోవడంతో అందరూ కలసి అక్కడ పాతి ఉన్న హద్దురాయిని పెకలించారు. సన్నీ నడుముకు దాన్ని కట్టి కుందేరులో పడేశారు. మృతుని సెల్‌ఫోన్‌ను శివనాగ కృష్ణ తీసుకుని కాలనీలోని 300 ఇండ్ల కాలనీలోని శ్మశాన వాటికలో పూడ్చిపెట్టాడు. హత్యకు ఉపయోగించిన కొడవలిని చుక్కయ్య పేట శ్మశానంలో విజయ్ దాచి పెట్టాడు. నిందితులు ఉపయోగించిన రెండు ద్విచక్ర వాహనాలు, హత్యకు ఉపయోగించిన కొడవలి, వైరుతాడు, మృతుడి సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులందరినీ ఈపురుపాలెం శేఖర్ పుట్ట వద్ద ఈనెల 8వ తేదీన 3:30 గంటలకు అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. అత్యంత చాకచక్యంగా పది రోజుల్లో కేసును ఛేదించిన రూరల్ సీఐ, ఎస్ఐ, పోలీసు సిబ్బందిని ఆయన అభినందించారు.

కేఎల్‌యూకు ఏ++ గ్రేడ్



కేఎల్‌యూ అందుకున్న ఏ++ గ్రేడ్ సర్టిఫికెట్

తాడేపల్లిరూరల్ : వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ ఇటీవల జరిగిన ది గ్రీన్ ర్యాంకింగ్స్ 2023 ప్లాటినం బ్యాండ్‌లో ఏ++ గ్రేడ్‌ను అందుకున్నట్లు వర్సిటీ ప్లానింగ్ డీన్ డాక్టర్ వి.రాజేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచస్థాయిలో సంపూర్ణ విద్యను అందించడానికి నిరంతరం కృషిచేస్తున్న తమ విశ్వవిద్యాలయంలో ఎటువంటి కాలుష్యంలేని ఆరోగ్యకరమైన వాతావరణం నెలకొన్న కారణంగా ఏ++ గ్రేడ్ వచ్చిందని వివరించారు. మౌలిక సదుపాయాలు, నిర్వహణ, పరిరక్షణ, ఉత్పత్తి, వనరుల వినియోగం నీరు, వ్యర్థాల రీ సైక్లింగ్ తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ గ్రేడ్ ఇచ్చినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్ధసారథి వర్మ, ప్రొ చాన్సలర్ డాక్టర్ ఎన్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగం డీన్ డాక్టర్ వి.రాజేష్, అసోసియేట్ డీన్ కె.జె.బ్రహ్మాచారి ఆనందం వ్యక్తం చేశారు.

బీటెక్ విద్యార్థి గల్లంతు

తుళ్లూరు : గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం రాయపూడి గ్రామంలో పుష్కర్ ఘాట్ వద్ద విట్ కాలేజి విద్యార్థి కొల్లిపర సాయి లోహిత్(22) ఆదివారం ఈత కోసం వచ్చి నీట మునిగాడు. లోహిత్‌తోపాటు సుమారు ఏడుగురు విద్యార్థులు ఈతకు వచ్చారు. ఐనవోలు గ్రామంలోని విట్ యూనివర్శిటీలో లోహిత్ బీటెక్ ఈసీఈ నాలుగో సంవత్సరం చదువుతున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహం కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కృష్ణాజిల్లా చల్లపల్లికి చెందిన విద్యార్థిగా గుర్తించారు. ఘటనా స్థలానికి చేరుకున్న తుళ్ళూరు సీఐ ఆనందరావు మృతదేహం కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

సూర్యలంక శివ క్షేత్రానికి మాజీ మంత్రి గాదె విరాళం

బాపట్ల అర్బన్: సూర్యలంక సముద్ర తీరాన అత్యంత ప్రతిష్టాత్మకంగా రూ. 10 కోట్లతో నిర్మాణం అవుతున్న తారకేశ్వరస్వామి ఆలయానికి మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకుడు గాదె మధుసూదనరెడ్డి రూ.లక్ష విరాళాన్ని ఆదివారం ఆలయ ఫౌండర్ మంతెన దశరథ మహారాజు, మూర్తి రాజుకు అందజేశారు. అనంతరం మధుసూదనరెడ్డి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ స్థపతి గోపాలకృష్ణశర్మ, వైఎస్సార్ సీపీ బాపట్ల నియోజకవర్గం నాయకుడు అల్లం గోపీకృష్ణ, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు జిట్టా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మహిళా నాయకురాలు జి.గిరిజారాణి, పార్టీ నాయకులు దోమా నాగేశ్వరరెడ్డి, కుంచాల వీర రాఘవరెడ్డి, డేగల రవిరెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు..

వచ్చే ఎన్నికల్లో జగనన్నకు మద్దతు పలకాలి

పౌరసరఫరాల మంత్రి కారుమూరి నాగేశ్వరరావు


జగనన్న మా భవిష్యత్ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ప్రభుత్వ విప్ పీఆర్కే, ఎమ్మెల్సీ జంగా, పీవీఆర్

మాచర్ల: రాష్ట్రంలో ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందిస్తూ అభివృద్ధి చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లోనూ మద్దతు పలకాలని పౌరసరఫరాల మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి కోరారు. ఆదివారం శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి తిరునాళ్ల సందర్భంగా పట్టణానికి వచ్చారు. దేవాలయాన్ని సందర్శించి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం 24వ వార్డులో కౌన్సిలర్ షేక్ దస్తగిరి ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న మా భవిష్యత్ మా నమ్మకం జగనన్న కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లు అంటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్షేమ పథకాలు మరో ఐదేళ్ళు కొనసాగించేందుకు సీఎం జగన్ కృషి చేస్తున్నారని, ఆయనకు మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, మాజీ చైర్మన్ తురక కిశోర్, అబ్దుల్ జలీల్, వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావు, కౌన్సిలర్లు షేక్ కరీముల్లా, షేక్ సుభాని, షేక్ నాగూర్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

నకిలీ వైద్యుడు అరెస్ట్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ రవికిరణ్

విజయవాడ స్పోర్ట్స్: విజయవాడ, గుంటూరు జిల్లాలోని పలు ప్రైవేట్ ఆస్పత్రిల్లో రోగులను వైద్యుడిగా నమ్మించి డబ్బులు వసూలు చేస్తున్న వ్యక్తిని ఎన్టీఆర్ జిల్లా పోలీసులు అరెస్టుచేశారు. నిందితుడి నుంచి రూ.4,500 నగదు ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు వివరాలను ఏసీపీ డాక్టర్ బి.రవికిరణ్ సూర్యారావుపేట పోలీస్ స్టేషన్ వద్ద ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం, రెల్లివలస గ్రామానికి చెందిన 24 ఏళ్ల ధర్మవరపు జయరాం ఇంటర్మీడియెట్ చదివాడు. కొన్నేళ్లు విశాఖపట్నం పరిసర ప్రాంతాల్లోని ప్రైవేటు ఆస్పత్రుల్లో డాక్టర్ల వద్ద అసిస్టెంట్‌గా పని చేశాడు. జల్సాలకు అలవాటు పడిన జయరాం సులువుగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో డాక్టర్ అవతారం ఎత్తాడు. ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి తాను డాక్టర్‌నని రోగులు, వారి బంధువులను నమ్మించేవాడు. రోగుల గదులకు వెళ్లి తన వద్ద నగదు ఉందని, ఫోన్ పేలో బ్యాలెన్స్ లేదని నమ్మబలికేవాడు. ఫోన్ పేకు నగదు బదిలీ చేస్తే నగదు ఇస్తానని చెప్పేవాడు. నగదు బదిలీ జరిగిన తరువాత ఆపరేషన్ థియేటర్‌లో పర్సు మర్చిపోయానని చెప్పి అక్కడ నుంచి ఉడాయించేవాడు. ఇదే తరహాలో విజయవాడ, గుంటూరులోని పలు ఆస్పత్రుల్లో నగదు వసూలు చేశారు. విజయవాడలో జరిగిన మూడు ఘటనలపై సూర్యారావుపేట పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. నిందితుడి కోసం పోలీసులు మూడు బృందాలుగా ఏర్పడి గాలించారు. ఈ నెల నాలుగో తేదీన విజయవాడలోని కృష్ణలంకలోని ఓ హోటల్ రూమ్‌లో దిగిన జయరాం వారధి వద్ద సంచరిస్తుండగా పోలీసులు ఆదివారం ఉదయం అరెస్టు చేశారని ఏసీపీ తెలిపారు. నిందితుడుపై రాష్ట్ర వ్యాప్తంగా పలు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయని వివరించారు. విలేకరుల సమావేశంలో సీఐ బి.హెచ్.వెంకటేశ్వర్లు, ఎస్ఐలు ఫణీంద్ర, ప్రమీల, రంభ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో టీడీపీ నేతల చేరిక


పార్టీలో చేరిన వారితో ప్రభుత్వ విప్ పీఆర్కే

వెల్దుర్తి: సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న బృహత్తర అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పలువురు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. లోయపల్లి సర్పంచి బలిగొడుగుల మున్నీ నాయక్ ఆధ్వర్యంలో మండలంలోని పిచ్చయ్య బావి తండాకు చెందిన హనుమాన్ నాయక్, కొండా నాయక్, గన్యా నాయక్ మరికొందరు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలోకి చేరారు. ఎమ్మెల్యే పీఆర్కే వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ గిరిజనులపై ఎంతో అభిమానంతో ఉన్నారని తెలిపారు. అటవీ హక్కుల చట్టం ద్వారా భూముల్ని పంపిణీ చేసి వారి కుటుంబాల అభివృద్ధికి పాటుపడ్డారని చెప్పారు. పార్టీలో చేరిన వారికి అన్ని విధాలా సహకరిస్తానని హామీ ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో వై.ఎస్. జగన్‌కు అందరం మద్దతుగా నిలిచి ఆయన్ను ముఖ్యమంత్రి చేసేందుకు సైనికుల్లా పని చేయాలని తెలిపారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూరగాయల మార్కెట్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు

రాష్ట్ర ప్రభుత్వ సహకార, మార్కెటింగ్ సలహాదారు బ్రహ్మానందరెడ్డి



మార్టూరు: మార్టూరు కూరగాయల మార్కెట్ అభివృద్ధి కోసం రూ. 64 లక్షల నిధులు మంజూరైనట్లు మార్కెటింగ్ అండ్ కో ఆపరేటివ్ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. తాడేపల్లి నుంచి ఒంగోలు వెళ్తూ ఆదివారం ఆయన మార్టూరులో విలేకరులతో మాట్లాడారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని మార్కెట్‌లో సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు కోసం రూ.22 లక్షలు మంజూరు అయినట్లు, ఈ నెల 12వ తేదీలోపు టెండర్ల దాఖలుకు అధికారులు ఆన్‌లైన్ దరఖాస్తుకు నోటీసులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. మార్కెట్ దక్షిణం వైపున గల నూతన గోడౌను ప్రాంగణంలో గోడ నిర్మాణం ఇతర అభివృద్ధి పనులతోపాటు 212 మంది హమాలీలకు యూనిఫాం, లైసెన్సులు పంపిణీ కోసం రూ.42 లక్షలు నిధులు మంజూరు అయినట్లు బత్తుల తెలిపారు. రైతులు కూరగాయల మార్కెట్‌లోని వ్యాపారులు, హమాలీల సంక్షేమ కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన అన్నారు.

హర్షవర్ధన్ ఆచూకీ కోసం ముమ్మర గాలింపు


సముద్రంలో గాలింపు చర్యలు నిర్వహిస్తున్న పోలీసులు, మత్స్యకారులు

కోడూరు(అవనిగడ్డ): మండలంలోని హంసలదీవి సాగరసంగమం వద్ద గల్లంతైన హర్షవర్ధన్ ఆచూకీ కోసం పోలీసులు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. పెనమలూరు మండలానికి చెందిన హర్షవర్ధన్ స్నేహితులతో కలిసి శనివారం సంగమం వద్దకు వచ్చి, ప్రమాదవశాత్తూ గల్లంతైన సంగతి విదితమే. హర్షవర్ధన్ ఆచూకీ లభించకపోవడంతో ఆదివారం కోడూరు పోలీసులు, పాలకాయతిప్ప మెరైన్ పోలీసులు స్థానిక మత్స్యకారుల సహాయంతో గాలింపు చర్యలపై ప్రత్యేక దృష్టి సారించారు. సముద్రం, సంగమం, కృష్ణానది పాయలపై మూడు బృందాలుగా విడిపోయి పడవలపై గాలింపు నిర్వహిస్తున్నారు. అవనిగడ్డ సీఐ జి.శ్రీనివాస్, పాలకాయతిప్ప మెరైన్ సీఐ వల్లభనేని పవన్‌కిషోర్, ఎస్ఐలు రాజేంద్రప్రసాద్, జిలానీ కూడా సముద్రంపై గాలింపు చర్యల్లో పాల్గొన్నారు. సంగమం వద్ద లోతు అధికంగా ఉండడంతో పాటు ఆ ప్రాంతంలో నీటి ఒరవడి ఎక్కువగా ఉండడంతో హర్షవర్ధన్ ఆచూకీ లభించలేదని, నీటిలో పాటు మడప్రాంతాల్లోకి కొట్టుకెళ్లాడా అనే కోణంలనూ గాలింపు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. గతంలో ఈ ప్రాంతంలో గల్లంతైన వారి ఆచూకీ ఇంత వరకు లభించలేదని, పర్యాటకులు సాగరతీరంలో తగిన జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని సీఐ కోరారు. గల్లంతైన హర్షవర్ధన్ తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు తీరంలో భోరున విలపిస్తూ, ఆచూకీ కోసం ఎదురు చూస్తున్నారు.

50 ఏళ్ల జ్ఞాపకాలతో.. ఆత్మీయ సమ్మేళనం


కారంచేడులో చిన్ననాటి స్నేహితుల ఆత్మీయ కలయిక

- 1973–74 టెన్త్ బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమావేశం
- హాజరైన హైకోర్టు మాజీ న్యాయమూర్తి సునీల్ చౌదరి

కారంచేడు: యాభై ఏళ్ల తమ పూర్వ జ్ఞాపకాలను నెమరేసుకోవడానికి అక్కడకు చేరిన వారికి సమయం సరిపోలేదు. ఎన్నో మధుర జ్ఞాపకాలతో పాటు, చేదు అనుభవాలను పంచుకుంటూ ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం, పలకరింపులు, ఛలోక్తులతో పాటు అరే.. ఒరే అనుకుంటూ సాగింది వారి ఆత్మీక కలయిక. ఈ కార్యక్రమానికి ఆదివారం కారంచేడులోని డాక్టర్ దగ్గుబాటి రామానాయుడు కల్యాణ మండపం వేదికయ్యింది. గ్రామంలోని యార్లగడ్డ నాయుడమ్మ ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో 1973–74లో 10వ తరగతి చదివిన విద్యార్థులు అదే గ్రామంలోని ఒక కల్యాణ మండపంలో కలుసుకున్నారు. వీరిలో అనేక మంది రాజకీయం, వ్యవసాయం, వ్యాపారం, ఉద్యోగాల్లోనూ స్థిరపడ్డారు. ఎంతో బిజీగా ఉండే వీరంతా కారంచేడులో కలుసుకొని తమ చిన్ననాటి మధురమైన అనేక విషయాలను చర్చించుకున్నారు. మొదట గురువులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించుకున్నారు. ఆదే బ్యాచ్‌కి చెందిన తాళ్లూరి సునీల్‌చౌదరి హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేసి పదవీ విరమణ చేశారు. ప్రస్తుతం ఆయన రాష్ట్ర వినియోగదారుల హక్కుల సంఘం చైర్మన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ప్రతి ఒక్కరికీ జ్ఞాపికలను పూర్వ విద్యార్థి పద్మావతి బహూకరించారు. సామూహిక భోజనాలు చేసి కొద్దిసేపు తాము చదువుకున్న పాఠశాలలో సేద తీరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ యార్లగడ్డ సుబ్బారావు, మాజీ ఎంపీపీ ఎం.అక్కయ్యచౌదరి, దగ్గుబాటి లక్ష్మీ నారాయణ, గంటా ఉదయ్, పాటిబండ్ల హేమలత, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

31.5 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

పెనమలూరు: మండలంలోని కానూరులో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు ఆదివారం పట్టుకున్నారు. రెవెన్యూ అధికారుల కథనం మేరకు.. కానూరు నవత రోడ్డులో ఓ ప్రైవేటు గోడౌన్‌లో గొట్టిపు రమేష్‌బాబు రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచాడని సమాచారం అధికారులకు అందింది. తహసీల్దార్ టి.వి.సతీష్ ఆదేశాల మేరకు పీడీఎస్ ఉప తహసీల్దార్ భవాని, ఆర్ఐ భరద్వాజ్ ఆ గోడౌన్‌పై దాడి చేశారు. అక్రంగా నిల్వ ఉంచిన 31.5 టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేశారు.

అనుమానాస్పద స్థితిలో యువతి ఆత్మహత్య

కృష్ణలంక(విజయవాడతూర్పు): అనుమానాస్పద స్థితిలో ఓ యువతి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. కృష్ణలంక, రణదీవె నగర్‌కు చెందిన సానికొమ్ము ప్రత్యూష (22) నగరంలోని ఓ కళాశాలలో ఎంబీఏ చదువుతోంది. ఆమె తండ్రి వెంకటేశ్వరరెడ్డి నగరంలోని ఒక షాపులో గుమస్తాగా పనిచేస్తుండగా, తల్లి నారాయణమ్మ పొలం పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం ప్రత్యూష తండ్రి వెంకటేశ్వరరెడ్డి తన సొంతూరు ప్రకాశం జిల్లాలోని కనిగిరికి, ఆమె తల్లి పొలంపనికి వెళ్లింది. సాయంత్రం 5.30 గంటల సమయంలో ప్రత్యూషకు ఎన్నిసార్లు ఫోన్ చేసిన ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో పొరుగింటి వారికి వెంకటేశ్వరరెడ్డి ఫోన్ చేశాడు. వెంటనే వారు అతని ఇంటికి వెళ్లి చూడగా ప్రత్యూష ఉరికి వేలాడుతూ కనిపించింది.

బీటెక్ విద్యార్థి గల్లంతు

తుళ్లూరు : గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం రాయపూడి గ్రామంలో పుష్కర్ ఘాట్ వద్ద విట్ కాలేజి విద్యార్థి కొల్లిపర సాయి లోహిత్(22) ఆదివారం ఈత కోసం వచ్చి నీట మునిగాడు. లోహిత్‌తోపాటు సుమారు ఏడుగురు విద్యార్థులు ఈతకు వచ్చారు. ఐనవోలు గ్రామంలోని విట్ యూనివర్శిటీలో లోహిత్ బీటెక్ ఈసీఈ నాలుగో సంవత్సరం చదువుతున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహం కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కృష్ణాజిల్లా చల్లపల్లికి చెందిన విద్యార్థిగా గుర్తించారు. ఘటనా స్థలానికి చేరుకున్న తుళ్ళూరు సీఐ ఆనందరావు లోహిత్ మృతదేహం కోసం గాలింపు చర్యలు చేపట్టారు.